రబీ సా...గుతోంది

- పూర్తికాని దమ్ములు, నాట్లు
- నియోజకవర్గంలో 18 వేల ఎకరాల్లో వరిసాగు
- కరప మండలంలో 31 శాతమే రబీనాట్లు పూర్తి
- ఇలాగైతే చివరిలో ఇబ్బందులు



కొరిపల్లిలో వెదజల్లిన పంట పొలంలో ఎరువులు చల్లుకుంటున్న రైతు



వలసపాకలలో వెదజల్లిన పొలం



పెదకొత్తూరులో వెదజల్లేందుకు దమ్ముచేస్తున్న ట్రాక్టర్

కరప: మండలంలోని మెరక, శివారు ప్రాంతాల్లో రబీ సీజన్ నేటికీ పూర్తి కాలేదు. రైతులు ఇప్పటికీ దమ్ములుచేసి, వెదజల్లుకుంటున్నారు. డిసెంబర్ నెలాఖరుకల్లా నాట్లు పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నా నేటికీ పనులు కొనసాగుతున్నాయి. ఇలాగైతే సీజన్ చివరిలో సాగునీటి ఇబ్బందులు తప్పవని అధికారులు చెప్తున్నారు. గడచిన ఖరీఫ్‌లో ముందస్తు సాగుచేపట్టాలని, దానివల్ల రబీ కూడా ముందుకు వచ్చి, మూడో పంటగా అపరాలు సాగుచేయడానికి అనుకూలంగా ఉంటుందని, వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సాగు సూచనలు ఇచ్చారు. తొలకరి కోతలు నవంబరు నెలాఖరుకు పూర్తయినా, రబీ సీజన్‌లో జాప్యం జరుగుతోందంటున్నారు. డిసెంబరు నెల మొదటివారంలో నారుమళ్లు వేసుని, నెలాఖరు కల్లా వరి నాట్లు పూర్తిచేయడం, వెదజల్లు పద్ధతి అనుసరించడం చేయాలన్నారు. సార్వా కోతలు ముందుగానే వచ్చినా, పంట పొలాలు ఆరకపోవడంతో, నీరు మళ్లించి, దమ్ములు చేస్తే, పదును ఆరక ట్రాక్టర్లు దిగబడిపోతాయని ఆలస్యం చేస్తున్నట్టు రైతులు అంటున్నారు. నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం 18,414 ఎకరాలు ఉండగా కరప మండలంలో 13,952 ఎకరాల్లో వరిసాగు చేస్తారు. ఈ మండలంలోని భూములన్నీ కాలువ శివారు, మెరక భూములే. సహజంగానే మిగిలిన ప్రాంతాల కంటే మండల పరిధిలో నాట్లు ఆలస్యమవుతుంటాయి. అధికారులు ముందస్తు సాగు చేపట్టాలని చెప్పినా, భూములు ఆరకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతుంది. కాలువ శివారు భూములు కావడంతో ఇప్పుడే దమ్ములు చేసి, వెదజల్లుకుంటున్నట్టు రైతులు అంటున్నారు. వాకాడ, కూరాడ, వేములవాడ, కరప, వలసపాకల, కొరిపల్లి తదితర గ్రామాల్లో కొందరు రైతులు నారుమళ్లు వేసుకున్నారు. నారుమళ్లు వేసిన ప్రాంతాల్లో ఈ నెలాఖరుకు కానీ నాట్లు పూర్తికావని రైతులు తెలిపారు. ఆలస్యమైన ప్రాంతాల్లో స్వల్పకాలిక రకాలు సాగుచేయాలని అధికారులు చెప్తున్నా, బొండాలు (ఎంటీయూ 3626) రకానికి దిగుబడులతో పాటు ధర బాగుంటుందని, ఈ ఏడాది అధికశాతం రైతులు బొండాలు రకం వేసుకోగా, మరి కొందరు స్వల్పకాలిక రకాలను సాగుచేసుకుంటున్నారు. వెదజల్లు పద్ధతి అనుసరిస్తే సమయం కలిసి వస్తుందని రైతులు వెదజల్లుకు ప్రాధాన్యమిస్తున్నారు. సాధారణంగా ఊడ్చే పొలాల కంటే వెదజల్లిన పొలాలు రెండు వారాలు ముందుగా కోతకు వస్తాయని రైతులు తెలిపారు.

మండలంలో 31 శాతమే పూర్తి



మండలంలో రబీనాట్లు ప్రక్రియ ఇంతవరకు 31 శాతం అనగా 1730 హెక్టార్లలో పూర్తయింది. వారం పది రోజుల్లో రబీనాట్లు పూర్తవుతాయి. మండల పరిధిలో 95 శాతం మేర వెదజల్లు పద్ధతిని అనుసరిస్తున్నారు. మిగిలిన చోట్ల రైతులు వరినాట్లు వేసేందుకు 170 హెక్టార్లలో నారు పెంచుతున్నారు. వెదజల్లడం వల్ల సమయం కూడా కలిసి వస్తుంది. వెదజల్లులో కలుపు నివారణకు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. రైతులను అప్రమత్తం చేసి వెదజల్లు సాగులో అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నాం. దమ్ములో 25 కిలోల యూరియా, వెదజల్లిన పది రోజులకు 50 కిలోలు డీఏపీ, 25 కిలోల యూరియా, చివరిలో యూరియా, పొటాష్ ఎరువులు వినియోగించాలి. వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి, సూచనల మేరకు సాగు మెళకువలు అనుసరిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

– ఏవీ రాజేష్, కరప మండల వ్యవసాయాధికారి

క్లుప్తంగా

ఆహార అలవాట్లతో సుఖవంతమైన జీవితం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పోషకాహార నిపుణులు పార్థసారథి

కాకినాడ రూరల్: ప్రతి ఒక్కరూ జీవితాంతం ఆరోగ్యంగా, సుఖంగా ఉండాలని కోరుకుంటారని అందుకు చక్కని ఆహారపు అలవాట్లు అవసరమని పోషకాహార నిపుణులు పి.పార్థసారథి పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆహారంలో కొవ్వు, తీపి పదార్థాలను పరిమితంగా తీసుకోవాలన్నారు. అన్ని రకాల ఆహార పదార్థాలను తగిన పరిమాణంలో తీసుకోవాలని చెప్పారు. ఒకేసారి కాకుండా నాలుగైదు సార్లు ఆహారాన్ని తక్కువ మోతాదులో తీసుకోవాలని పార్థసారధి తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

గుండె ఆరోగ్యంపై అవగాహన అవసరం



గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు శ్రీనివాస్, ప్రణవ్, నరేష్

కాకినాడ రూరల్: స్థానిక అచ్చంపేటలోని మెడికవర్ హాస్పిటల్స్‌లో గుండె సంబంధిత సమస్యలపై ప్రముఖ గుండె వైద్య నిపుణులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మాత శ్రీనివాస్ మాట్లాడుతూ చలికాలంలో గుండె సంబంధి సమస్యలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కాలంలో వాతావరణం చల్లగా ఉండడంతో రక్తనాళాలు సంకోచిస్తాయని, దీనివల్ల రక్తప్రవాహం తగ్గిపోవడం, రక్తపోటు పెరగడం వంటి సమస్యలు ఏర్పడుతాయన్నారు. ప్రత్యేకించి గుండెపోటు ప్రమాదం ఎక్కువగా ఉంటుందన్నారు. చలికాలంలో గుండె ఆరోగ్యం కాపాడుకోవాలంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరమని చెప్పారు. ప్రత్యేకించి హై బ్లడ్ ప్రెజర్, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు చలి కాలంలో రెగ్యులర్ చెకప్ చేయించుకోవాలి. ప్రముఖ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రణవ్ పల్లెంపాటి మాట్లాడుతూ చలిలో చాలా మంది బయటకు వెళ్లడాన్ని తగ్గించి, వ్యాయామాన్ని నిర్లక్ష్యం చేస్తారని, ఇది గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. ప్రముఖ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కూరాకుల నరేష్ మాట్లాడుతూ గర్భిణులు, వయో వృద్ధులు, గుండె సంబంధ సమస్యలు ఉన్నవారు చల్లని వాతావరణం నుంచి తప్పక రక్షించుకోవాన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మాత శ్రీనివాస్, డాక్టర్ ప్రణవ్ పల్లెంపాటి, డాక్టర్ కూరాకుల నరేష్‌తో పాటు సెంటర్ హెడ్ శుభాకరరావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్ రామ్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసిన లయన్స్ క్లబ్ కార్యదర్శి శ్రీదేవి రెడ్డి తదితరులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట అడబాల కార్యాలయంలో లయన్స్‌క్లబ్ కాకినాడ విజన్ కోశాధికారి శ్రీవాణి ఆర్థిక సహకారంతో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ కార్యదర్శి శ్రీదేవి రెడ్డి మాట్లాడుతూ శీతాకాలంలో చలి తీవ్రత అధికంగా ఉన్నందున దుప్పట్లు అందజేయడం వృద్ధులకు ఎంతో ఉపకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యురాలు మీనాక్షి, మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్, ప్రసాద్ నాయుడు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ రోడ్డులో ట్రాఫిక్ మళ్లింపు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో సోమవారం నుంచి ట్రాఫిక్‌ను మళ్లించారు. వీకే రాయపురం నుంచి మాధవపట్నం శివారు వరకు ఉన్న గోతులను పూడ్చే కార్యక్రమంలో భాగంగా ఆర్ అండ్ బీ అధికారులు సామర్లకోట–కాకినాడ రోడ్డులో వాహనాలు రాకుండా చూడాలని సూచించడంతో ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు ఆధ్వర్యంలో సామర్లకోట నుంచి కాకినాడ వెళ్లే వాహనాలను అచ్చంపేట ఏడీబీ రోడ్డు మీదుగా మళ్లించారు. అలాగే కాకినాడ నుంచి వచ్చే వాహనాలను సర్పవరం నుంచి పనసపాడు, అచ్చంపేట ఏడీబీ రోడ్డు మీదుగా వాహనాలు సామర్లకోటకు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. చిన్న వాహనాలను మాత్రం కాకినాడ నుంచి కాకినాడ రోడ్డులో సామర్లకోట చేరుకోవడానికి అనుమతి ఇచ్చారు. కొన్ని రోజులుగా రైల్వే గూడ్స్ యార్డులో ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం లోడ్ వస్తుండడంతో వాటిని తరలించే సమయంలో ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ సమస్య ఏర్పడే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రైల్వే గూడ్స్ యార్డు వద్ద కానిస్టేబుల్‌ను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

దేహదారుఢ్య పరీక్షలకు 351 మంది హాజరు



దేహదారుఢ్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం: కాకినాడలోని పోలీస్ పెరేడ్ మైదానంలో ఆరోరోజైన సోమవారం కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో భాగంగా దేహదారుఢ్య పరీక్షలు జరిగాయి. ఎస్పీ విక్రాంత్ పాటిల్ పర్యవేక్షించిన ఈ పరీక్షలకు 351 మంది హాజరుకాగా 278 మంది తదుపరి ఎంపిక ప్రక్రియకు అర్హత సాధించారు.

మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



హసన్‌బాదలో గెలుచుకున్న సర్టిఫికెట్లను హెచ్ఎంతో కలసి చూపుతున్న విద్యార్థులు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు కుడో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. కాజులూరు మండలం హసన్‌బాద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన కుడో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ పోటీలలో కరప విద్యార్థులు పాల్గొని విజయం సాధించారన్నారు. ఈ కుడో పోటీలలో ప్రతిభ చూపిన పి.వీరప్రవీణకుమార్, డి.ఈశ్వర్ దుర్గాప్రసాద్, జి.దుర్గా దిలీప్, పి.రవికిరణ్, ఎ.రోహిన్, ఎస్.యశ్వంత్ కృష్ణచైతన్య, టి.దుర్గా ప్రసాద్, డి.డేవిడ్, వి.అభిరామ్ రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ దేవు దుర్గారావు, పీడీ కె.శ్రీనివాసరావు, స్టాఫ్ సెక్రటరీ ఎం.రమేష్, టి.శ్రీనివాస్ తదితర ఉపాధ్యాయులు అభినందించారు.

హెచ్ఎంపీవీపై అప్రమత్తం

కాకినాడ క్రైం: వైద్య ఆరోగ్య వర్గాలతో పాటు ప్రజల్లో కలవరానికి కారణమవుతున్న తాజా వైరస్ హెచ్ఎంపీవీ (హ్యూమన్ మెటా న్యూమో వైరస్) ఉనికి పట్ల అధికారులు అప్రమత్తమవుతున్నారు. కాకినాడ జీజీహెచ్‌లో మంగళవారం ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. కోవిడ్ తరహాలోనే శానిటైజేషన్, మాస్క్ ధారణ, పౌష్టికాహారం, సామాజిక దూరాన్ని పాటించడం ద్వారా ఈ వైరస్ బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని అధికారులు అంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో హెచ్ఎంపీవీ జాడ లేదని తెలిపారు.

పోక్సో చట్టంపై అవగాహన

కాకినాడ రూరల్: మండలంలోని పండూరు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం సిబ్బందికి పడాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నూరు శాతం బాలల రక్షణ, సేఫ్ టచ్, అన్ సేఫ్ టచ్, పోక్సో చట్టం తదితర వాటిపై అవగాహన కల్పించారు. డీఎం అండ్ హెచ్ఓ కార్యాలయం నుంచి ఓఎస్ఓ విజయలక్ష్మి, డీఎస్ఓ గిరి గణేష్, మెడికల్ ఆఫీసరు మాధవి, పడాల చారిటబుల్ ట్రస్ట్ సీఈఓ సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొని మహిళలు, బాలికల భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

కరప: స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం బడ్జెట్ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో 2024–25 సంవత్సర సవరణ, 2025–26 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్‌పై చర్చించి, అనంతరం మండల పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించనున్నట్టు ఎంపీడీఓ అనుపమ తెలిపారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల కిటకిట

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తులు కిటకిటలాడారు. స్వామి వారికి ప్రీతికరమైన సోమవారం కావడంతో ఆలయంలో తెల్లవారు జాము నుంచి భక్తులు స్వామి వారిని దర్శనానికి బారులు తీరారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వామి వారికి పిఠాపురం మహారాజా గోత్రనామాలతో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అలాగే లక్ష పత్రి పూజలు జరిగాయి. ఆలయానికి వచ్చిన భక్తులు ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరిణి నుంచి తీసుకువచ్చిన నీళ్లతో స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. ఆలయంలోని పెద్ద నంది, మూలవిరాట్ ఉప ఆలయాలు, స్వామి వారిని అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉదయం ప్రసాదం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లికి రాజగోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకటరమణ, చెరుకూరి సుందరరామయ్య, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్ పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారిని అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు.

ఈసీఈ గ్యాలరీ ప్రారంభం



ఈసీఈ గ్యాలరీని ప్రారంభించిన వీసీ మురళీకృష్ణ

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ప్రాంగణంలో ఈసీఈ విభాగంలో ఆధునీకరించిన ఈసీఈ గ్యాలరీ హాల్‌ను సోమవారం వర్సిటీ ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ ప్రారంభించారు. యూసీఈకే అధ్యాపకులకు ఈ గ్యాలరీతో ప్రత్యేక అనుబంధం ఉందని, తాను అధ్యాపకుడిగా చేరిన తొలిరోజుల్లో విద్యా, సాంస్కృతిక పరంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టానన్నారు. ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన ద ఈసీఈ ప్రిసైజ్ వాల్యూమ్–1, ఇష్యూ–4 మ్యాగజైన్‌లను ఆన్‌లైన్‌లో ఆవిష్కరించి విశ్రాంత అధ్యాపకులు మురళీధరశర్మ, ప్రభాకరరావు, ఐ.శాంతి ప్రభలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసులు, మాజీ వీసీ శ్రీనివాసకుమార్, పద్మరాజు పాల్గొన్నారు.

మాతృ హృదయ దాతృత్వం



సామర్లకోట సామాజిక ఆరోగ్య కేంద్రానికి దుప్పట్లు అందజేసిన దాత నాగ ప్రసాద్

సామర్లకోట: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి పెద్దాపురానికి చెందిన ముత్యం నాగవరప్రసాద్ సుమారు రూ.30 వేల విలువ చేసే 120 బెడ్ షీట్లను బహూకరించారు. ఏడాదిన్నర క్రితం ఆయన భార్య రేష్మ ఈ ఆస్పత్రిలో ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ఆ సమయంలో వైద్యులు, సిబ్బంది చూపిన ప్రేమకు, చేసిన సేవలకు గుర్తుగా ఏదో ఒక విధంగా సాయం చేయాలని తలచారు. దీంతో ఆస్పత్రిలో ఉన్న 60 బెడ్‌లకు 120 బెడ్ షీట్లు ఏర్పాటు చేసి ఆస్పత్రి ఇన్‌చార్జి వైద్యాధికారి అమలకు అందజేశారు. ఆస్పత్రికి వచ్చే దివ్యాంగుల కోసం ఒక వీల్‌చైర్, దివ్యాంగుల స్టాండ్‌ను మరో దాత ఎస్.కోమలి ఏర్పాటు చేశారని డాక్టర్ అమల తెలిపారు. దాతలను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరునిగా వేణుగోపాలస్వామి





స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

బోట్‌క్లబ్: ధనుర్మాస వ్రత మహోత్సవాలు, రజత దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా స్థానిక దేవాలయం వీధిలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి సోమవారం వేంకటేశ్వరస్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి ఉదయం అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

శేషశయనుడిగా సీతారామయ్య

ధనుర్మాస వ్రత మహోత్సవాలు, రజత దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి శేషశయన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి ఉదయం అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వామి వారికి అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొన్నారు.

సబ్సిడీ నిల్.. కష్టాలు ఫుల్

- రాయితీపై పశువుల దాణా సరఫరాను నిలిపివేసిన ప్రభుత్వం
- భారంగా మారిన పశువుల పెంపకం
- ఆందోళన చెందుతున్న పాడిరైతులు
- ప్రోత్సాహకాలు కొనసాగించాలని డిమాండ్



వాకతిప్పలో పాడి రైతులకు రాయితీపై దాణా సరఫరా చేస్తున్న అధికారులు (ఫైల్)

కొత్తపల్లి: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాడి రైతులను పోత్సహించింది. పాల ధరలను పెంచడంతో పాటు వారికి పలు పోత్సాహకాలను అందించింది. కాగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రోత్సాహకాలు, సబ్సిడీలను నిలిపివేస్తూ పాడి పరిశ్రమను నిర్వీర్యం చేస్తోంది. పాడి రైతులకు రాయితీపై అందించే పశువుల దాణా(సమీకృత దాణా) పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో పశువులను మేపడం భారంగా మారుతుందని పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో సుమారు 42 వేల ఆవులు, గేదెలు ఉండగా కొత్తపల్లి మండలం 1830 ఆవులు, 10205 పాడి గేదెలు ఉన్నట్లు కొత్తపల్లి పశువైద్యాధికారి శ్రీమన్నారాయణ తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో ప్రోత్సాహకాలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాడి రైతులకు అండగా నిలిచింది. పాల ఉత్పత్తిని పెంచడంతో పాటు పశువులకు పోషకాహారం అందించేందుకు సమీకృత దాణాను ప్రభుత్వం రాయితీపై పాడి రైతులకు సరఫరా చేసేది. 200 కిలోల సమికృత దాణా–టోటల్ మిక్స్‌డ్ రేషన్ (టీఎంఆర్) బస్తా ధర మార్కెట్‌లో రూ.3160 ఉండగా సుమారు 58 శాతం రాయితీ రూ.1860 పోగా రూ.1300కే రైతులకు అందించారు. అలాగే రైతులకు గడ్డి కోత యంత్రాలను రాయితీపై సరఫరా చేశారు. గడ్డి కోత మెషీన్ ధర రూ.33970 ఉండగా 40 శాతం రాయితీ రూ.13588 మినహా రూ.20382కే రైతులకు అందజేశారు. గడ్డి విత్తనాలను 75 శాతం రాయితీపై సరఫరా చేశారు. కాగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం గడ్డి విత్తనాలు పథకాన్ని మాత్రమే కొనసాగిస్తోంది. పశువుల దాణా పథకాన్ని గత ఆరు నెలలుగా నిలిపివేసింది. ప్రభుత్వం సబ్సిడీ దాణా పథకాన్ని నిలిపివేయడంతో గ్రామాల్లో పాడి రైతులు పశువులను పెంచేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పాడి రైతులకు అందించే ప్రోత్సాహకాలను కొనసాగించాలని కోరుతున్నారు.

ఎండు గడ్డి ధరలకు రెక్కలు

గతంలో గ్రామీణ ప్రాంతాల్లో రైతులు వరి పంటను సంప్రదాయ పద్ధతిలో కూలీలతో కోత కోయించి పనలపై వారం రోజులు ఆరిన తర్వాత ట్రాక్టర్లతో నూర్పిడి చేసేవారు. ఈ విధానంతో రైతులకు కావలిసినంత ఎండు గడ్డి లభించేది. ప్రస్తుతం వరి కోత యంత్రాల రాకతో ఎండు గడ్డికి గిరాకీ పెరిగింది. మెషన్‌తో కోత కోసిన గడ్డి పశుగ్రాసానికి పనికి రాదు. దీంతో ట్రాక్టర్ ఎండుగడ్డి ధర రూ.13 వేల నుంచి రూ.15 వేల వరకూ పలుకుతోంది.

రీ సర్వే సక్రమంగా నిర్వహించాలి



అసిస్టెంట్ కలెక్టర్ భావనకు వినతి పత్రం అందజేసిన ఎంపీపీ సత్తిబాబు

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్తంగా రైతుల భూముల రీ సర్వేను సక్రమంగా పూర్తి చేయాలని తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విధులపై అవగాహన పొందేందుకు అసిస్టెంట్ కలెక్టర్ భావన నెలరోజుల పాటు శిక్షణ తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆమె శనివారం మండల పరిధి సర్వేయర్లు, వీఆర్వోలతో తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలో వేట్లపాలెం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారని, దీనిని దృష్టిలో పెట్టుకుని సర్వే సమయంలో రైతులకు చెందిన దస్తావేజులు, పాస్ పుస్తకాల జెరాక్స్ తీసుకొని వారి వారి భూములను రీ సర్వే చేసి అనంతరం సర్వే రిపోర్టును వారికి అందజేయాలన్నారు. వారి నుంచి అభ్యంతరాలు ఎదురైతే పరిష్కరించాలని, లేకుంటే ఆన్‌లైన్ చేయాలని సూచించారు. రీ సర్వేలో వీఆర్వోలు అందుబాటులో ఉండాలని సూచించారు.

బాధితులను ఆదుకోవాలి

మండల పరిధిలోని వేట్లపాలెం గ్రామంలో గత నెల 15వ తేదీన జరిగిన దాడిలో మృతి చెందిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలని అసిస్టెంట్ కలెక్టరు భావనకు ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో జరిగిన దాడి ఘటనను వివరించి కాల్దరి ప్రకాశరావు, కాల్దరి చంద్రరావు, కాల్దరి ఏసుబాబు కుటుంబాల వారు జీవనోపాధి లేక ఇబ్బంది పడుతున్నారని, వారికి న్యాయం చేయాలని సత్తిబాబు విజ్ఞప్తి చేశారు. గత నెల 21న జరిగిన మండల ప్రజా పరిషత్ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశామని ఎంపీపీ చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.చంద్రశేఖరరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ పద్మజారెడ్డి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీనివాసు, మండల సర్వేయర్ పి.సీతారామాచార్యులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడమ్మ గరగ ఉత్సవం



అమ్మవారి గరగ ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న ఈఓ విజయలక్ష్మి

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ అమ్మవారి గరగ ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా అమ్మవారిని సాంప్రదాయబద్ధంగా పుట్టింటికి వెళ్లి వచ్చేందుకు ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో గరగలను తీశారు. ఆలయం వద్ద గరగల నాట్యం అనంతరం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో గరగ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.